



ద్రాక్ష గుత్తులు కాదు.... రేల పుష్పాలు

చిత్తూరు గంగినేనిచెరువు పార్కులో విరగ్గాసిన రేల పువ్వులు ఇవి. కాసియా జాతికి చెందిన దీన్ని అరగ్వధ అని కూడా అంటారు. ఈ చెట్టుకు కాసిన పువ్వులు ద్రాక్ష గుత్తుల్లా కనిపిస్తుండడంతో ప్రజలు వింతగా చూస్తున్నారు.



9 మండలాల్లో ఫ్లోరైడ్ ప్రభావం

పాఠశాలలు ప్రారంభమైన వెంటనే 11 ఏళ్లలోపు పిల్లలకు స్ర్కీనింగ్ పరీక్షలు

చిత్తూరు రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 21 జిల్లాల్లో ఫ్లోరైడ్ ప్రభావం ఉంది. ఇందులో మన జిల్లా కూడా ఉందని అధికారులు గుర్తించారు. జిల్లాకు సంబంధించి 9 మండలాల్లోని 15 గ్రామ పంచాయతీలకు చెందిన 21 గ్రామాల్లో ఫ్లోరైడ్ సమస్య ఉన్నట్లు గుర్తించారు. అందులో ఏడు పంచాయతీల్లో అధికంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఆయా గ్రామాల్లో జిల్లా అధికారులు వైద్య శిబిరాలు నిర్వహించాలని రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ అధికారులు ఆదేశించారు. అలాగే పాఠశాలలు పునఃప్రారంభమైన వెంటనే 11 ఏళ్లలోపు పిల్లలందరికీ బడుల్లోనే డెంటల్ ఫ్లోరోసిస్, స్కెలిటల్ ఫ్లోరోసిస్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించాలన్నారు. ఫ్లోరోసిస్ అనుమానిత పిల్లలకి మల్టీ విటమిన్, కాల్షియం, విటమిన్ సీ మాత్రలు అందజేసి,అవసరమైన వారికి వైద్యం చేయాలని సూచించారు. అలాగే స్కెలిటల్ ఫ్లోరోసిస్ వ్యాధి బారిన పడిన వారికి నెక్‌బెల్ట్, వాకింగ్ స్టిక్స్, వీల్ చైర్లు, టాయిలెట్ చైర్లు వంటివి అందించాలన్నారు. వ్యాధి తీవ్రత ఎక్కువై.. సర్జరీ అవసరమైతే ఉచితంగా చేయించనున్నట్లు పేర్కొన్నారు.

ఐరాలలో అత్యధికం

తాగునీటిలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) లెవల్ 1.50 ఉండాల్సి ఉంది. ఐరాల మండలం 35 యర్లంపల్లె పంచాయతీ గుట్టకిందపల్లె హరిజనవాడలో అత్యధికంగా 10.30 బీఐఎస్ లెవల్ ఉన్నట్లు గుర్తించారు.

బీఐఎస్ లెవల్ 1.50 దాటిన గ్రామాల వివరాలు

మండలం	పంచాయతీ	గ్రామం	బీఐఎస్ లెవల్	మండలం	పంచాయతీ	గ్రామం	బీఐఎస్ లెవల్
చిత్తూరు రూరల్	చెర్లోపల్లె	కమ్మపల్లె	2.74	పుంగనూరు	ఆరడిగుంట	అమ్మిగానిపల్లె	1.73
జీడీనెల్లూరు	నెల్లేపల్లె	కొత్తూరు (ఏఎడబ్ల్యూ)	1.64	పుంగనూరు	ఆరడిగుంట	ఆరడిగుంట	1.53
జీడీనెల్లూరు	పాపిరెడ్డిపల్లె	పెడకంటిపల్లె (హెచ్‌డబ్ల్యూ)	1.95	పుంగనూరు	ఆరడిగుంట	జవ్వకొత్తూరు	1.52
జీడీనెల్లూరు	తూగుండ్రం	దాసరపల్లె	1.69	పుంగనూరు	కుమారనత్తం	చిన్నగుట్టపల్లె	1.55
గుడిపాల	బొమ్మసముద్రం	బొమ్మసముద్రం (ఏఎడబ్ల్యూ)	1.60	పూతలపట్టు	చిటిపిరాళ్ల	పసుపులేటివారిపల్లె	1.84
గుడిపాల	మరకాలకుప్పం	నాగేంద్రపురం	1.57	పూతలపట్టు	వడ్డేపల్లె	అమ్మగారిపల్లె	2.02
గుడిపాల	రామభద్రాపురం	రామభద్రాపురం (హెచ్‌డబ్ల్యూ)	1.68	తవణంపల్లె	నల్లిశెట్టిపల్లె	నరసింహపల్లె	1.86
గుడిపాల	రామభద్రాపురం	రామభద్రాపురం	1.70	యాదమరి	కీనాటంపల్లె	కోయిపూరు (హెచ్‌డబ్ల్యూ)	1.80
ఐరాల	35 యర్లంపల్లె	గుట్టకిందపల్లె (హెచ్‌డబ్ల్యూ)	10.30	యాదమరి	కీనాటంపల్లె	కీనాటంపల్లె (హెచ్‌డబ్ల్యూ)	1.75
				యాదమరి	కీనాటంపల్లె	కీనాటంపల్లె	1.52
				యాదమరి	కీనాటంపల్లె	కొత్తకాపూరు	1.62
				నగరి	బీరకుప్పం	కన్నికాపురం	1.73



రాంపల్లె బీట్ లో పగలే ఏనుగుల గుంపు సంచారం

పట్టపగలే గజదాడులు

- రాంపల్లె బీట్‌లో 14 ఏనుగుల మంద
- భయం గుప్పెట్లో గ్రామీణ ప్రజలు
- మామిడి పంటకు తీవ్ర నష్టం



విరిగిపోయిన కొబ్బరి చెట్టు

సోమల, మే 28 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని అటవీ సరిహద్దు పొలాలపై గజదాడులు కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం 14 ఏనుగుల గుంపు రాంపల్లె బీట్ సమీపంలో సంచరించడంతో రైతులు భయాందోళనలో పడ్డారు. రాంపల్లె బీట్ సమీపంలోని బాబురెడ్డి టమోటా, మామిడి తోటల్లో స్వైరవిహారం చేసిన ఏనుగులు టమోటా పండ్లను తిని తొక్కేశాయి. ఊతంగా నాటిన కర్రలను ధ్వంసం చేసి, బోరు, డ్రిప్ పరికరాలను విరిచేశాయి. ఏనుగుల దాడులను గుర్తించిన పరిసరాల రైతులు జట్లుగా ఏర్పడి టపాసులు పేల్చుతూ, డప్పుల శబ్దంతో వాటిని పత్రపల్లె వైపు దారి మళ్లించారు. అయితే రెడ్డివారిపల్లె, బోనమంద, చిన్నకమపల్లె, పేటూరు వైపు మామిడి, టమోటా సాగు వందల ఎకరాల్లో ఉండడంతో ఆయా గ్రామాల రైతులు ఆందోళన పడుతున్నారు. ఏనుగుల గుంపు చిన్న ఉప్పరపల్లె సమీపంలోని చెరువుకోన నుంచి రాంపల్లెబీట్, పత్రపల్లె, ఇర్లపల్లె, కొత్తూరు, రెడ్డివారిపల్లె మీదుగా బోనమంద, దుర్గం కొండ ప్రాంతంలో తరచూ సంచరిస్తున్నాయి. ఏనుగుల దాడుల్లో పంటలు, ఆస్తులు నాశనమవుతున్నాయి. రైతులు పొలాల వైపు వెళ్లలేకపోతున్నారు. ప్రస్తుతం మామిడి సీజన్ కావడంతో తోటల వద్ద కాపలా ఉన్న కూలీలు, గొర్రెల కాపర్లు గ్రామాల్లోనే ఉండిపోతున్నారు. ముఖ్యంగా అటవీ శివారుల్లోని ఇర్లపల్లె, రెడ్డివారిపల్లె, బోనమంద ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.ఇర్లపల్లెలోని పలువురు యానాదులు గొర్రెలు, మేకల పెంపకంతో జీవనం సాగిస్తూ ఉన్నారు. వీరంతా ఏనుగుల సంచారంతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఇళ్ల ముందు మంటలు వేసుకొని ఏ సమయంలో ఏనుగులు వస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. అటవీ అధికారులు స్పందించి నిపుణులైన ట్రాకర్ల ద్వారా ఏనుగులను అటవీ ప్రాంతానికి తరలించాలని రైతులు కోరుతున్నారు.

వేము, మదర్ థెరిస్సా కాలేజీల్లో డీఎస్సీ పరీక్షలు

చిత్తూరు సెంట్రల్, మే 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు డీఎస్సీ పరీక్షా కేంద్రాలను గుర్తించినట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు. జూన్ 6 నుంచి జూలై 6 వరకు జరిగే ఈ పరీక్షలకు పూతలపట్టు మండలంలోని వేము ఇంజనీరింగ్ కళాశాల, పలమనేరులోని మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలను గుర్తించామన్నారు., మరి కొన్ని కళాశాలలను పాఠశాల విద్యాశాఖ గుర్తించనున్నట్లు తెలిపారు.ఈనెల 19న ప్రారంభమైన పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. ఈనెల 31 నుంచి స్థానిక పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జవాబుపత్రాల మూల్యాంకనం చేపట్టనున్నట్లు ఆమె వివరించారు.

నాలుగు మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, మే 28 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో నాలుగు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. నగరిలో 9.8, నింద్రలో 7.2, విజయపురంలో 5.8, సదుంలో 1.2 మిమీ వర్షపాతం నమోదయ్యింది.



గాయపడ్డ మునస్వామి, లక్ష్మీప్రసాద్

ఎలిఫెంట్ టాస్క్‌ఫోర్స్‌పై గజరాజుల దాడి

ఇద్దరికి గాయాలు

ఎర్రావారిపాలెం , మే 28 (ఆంధ్రజ్యోతి); ఎలిఫెంట్ టాస్క్‌ఫోర్స్ అధికారులపై గజరాజులు దాడి చేయడంతో ఇద్దరు గాయపడ్డారు.భాకరాపేట కేంద్రంగా పనిచేసే ఎలిఫెంట్ టాస్క్‌ఫోర్సు అధికారులకు ఎర్రావారిపాలెం మండలం ఎల్లమంద పంచాయతీ బోయపల్లె సమీపంలోని బత్తలగుట్ట వద్ద ఏనుగుల గుంపు కదలికలున్నాయనే సమాచారం అందింది. అదే సమయంలో డ్రోన్ల ద్వారా గజరాజుల కదలికలను గుర్తించిన టాస్క్‌ఫోర్స్‌లోని ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ మునస్వామి, ఎల్లమంద ఎఫ్‌బీవో ప్రసాద్, లక్ష్మీ ప్రసాద్,సిబ్బంది బుధవారం సాయంత్రం బత్తలగుట్టకు వెళ్లారు. గజరాజులను అడవిలోకి మళ్లించేందుకు ప్రయత్నిస్తుండగా జంట ఏనుగుల్లో ఒకటి అధికారులపైకి దూసుకొచ్చింది. ఈ హఠాత్ సంఘటనతో వారు చెల్లాచెదురై పరుగెత్తి ప్రాణాలు దక్కించుకొనే క్రమంలో ఎఫ్ఎస్‌వో మున స్వామి, గార్డు లక్ష్మీప్రసాద్ గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం వాహనంలో తిరుపతికి తరలించారు.ఇంతలో భాకరాపేట రేంజ్ పరిధిలోని రంగంపేట వద్ద జాతీయ రహదారి పక్కన కొలనులో చిరుత గాయపడి మృతి చెందిందనే సమాచారం అందడంతో సిబ్బంది మొత్తం అక్కడికి వెళ్లారు. రేంజర్ వెంకట్రమణ గాయపడిన అధికారులకు మెరుగైన చికిత్స అందించేందుకు సకాలంలో చర్యలు చేపట్టారు.ఎర్రావారిపాలెం మండలంలోని కోటకాడ పల్లె, ఎల్లమంద ,ఉస్తికాయల పెంట పంచాయతీల్లో రైతులు పొలాలకు రాత్రి పూట వెళ్ళరాదని సూచించారు.



బోయపల్లె సమీపంలోని బత్తలగుట్ట వద్ద గజసంచారం

ఆదర్శప్రాయుడు ఎన్టీఆర్



ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్, మే 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావును ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌హాల్లో ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో భాగంగా కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటు సినీ రంగంలో, ఇటు రాజకీయరంగంలో తనదైన ముద్రవేసిన వ్యక్తి రామారావు అన్నారు. పేదప్రజల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. డీఆర్వో మోహన్ కుమార్, కలెక్టరేట్ ఏవో కులశేఖర్, జిల్లా పర్యాటకశాఖ అధికారిణి గౌరి, డీఆర్డీఏ పీడీ శ్రీదేవి, ఉద్యానశాఖ డీడీ మధుసూదన రెడ్డి, సీపీవో సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మామిడికి గిట్టుబాటు ధర నాలుగురోజుల్లో ఖరారు


- రైతు సంఘాలకు కలెక్టర్ హామీ



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న స్థిరీకరణ కమిటీ సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్, మే 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తోతాపురి మామిడి రకానికి నాలుగు రోజుల్లో గిట్టుబాటు ధర నిర్ణయిస్తామని రైతు సంఘాల నేతలకు, మామిడి ధరల స్థిరీకరణ కమిటీ సభ్యులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ హామీ ఇచ్చారు. బుధవారం పలువురు రైతు సంఘాల నాయకులు కలెక్టర్‌ను కలిసి తోతాపురి మామిడికి కిలోకు రూ.30, బేనిషాకు రూ.50 చొప్పున గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. రైతు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు, జిల్లా అధ్యక్షుడు జనార్దన్, నాయకులు ఆనంద నాయుడు, హరిబాబు చౌదరి, మునీశ్వర రెడ్డి, భారతి, నాగరాజు, గంగరాజు తదితరులు కలెక్టర్‌ను కలిసినవారిలో ఉన్నారు. ఈనెల 31న స్థానిక ఎమ్మెల్యేలకు, ఎంపీలకు గిట్టుబాటు ధరలపై వినతిపత్రాలు అందించాలని నిర్ణయించారు. ప్రభుత్వ స్పందనను బట్టి భవిష్యత్తు కార్యాచరణను నిర్ణయిస్తామని ప్రకటించారు.

బర్డ్ డైరెక్టర్‌గా డాక్టర్ జగదీష్ బాధ్యతల స్వీకరణ



తిరుపతి, మే 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని బాలాజీ వికలాంగుల శస్త్రచికిత్స పరిశోధన, పునరావాస కేంద్రం (బర్డ్) డైరెక్టర్‌గా డాక్టర్ జగదీష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు సూచనలతో ఈనెల 2న బర్డ్ డైరెక్టర్‌గా జగదీష్‌ను నియమిస్తూ టీటీడీ ఈవో శ్యామలరావు ప్రొసీడింగ్స్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బర్డ్ ఆస్పత్రి పాత భవనంలో ఇదివరకు ఆయన ఉన్న డైరెక్టర్ ఛాంబర్‌లోనే బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వైద్యులు, వైద్యసిబ్బందితో మాట్లాడారు. ఆస్పత్రిలోని పలు విభాగాలను పరిశీలించారు. ఈసందర్భంగా డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్, ఎస్వీఎం శ్రీధర్, ఇతర నేతలు, అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



హుండీ లెక్కిస్తున్న ఆలయ ఉద్యోగులు

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.72 కోట్లు

శ్రీకాళహస్తి, మే 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రూ.1,72,70,504 వచ్చింది. బుధవారం ఆలయంలో హుండీ లెక్కింపు జరిగింది. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా బంగారం 73.200 గ్రాములు, వెండి 607.100 కిలోలు, విదేశీ కరెన్సీ 92 వచ్చింది. ఈ లెక్కింపులో ఆలయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జ్యూస్ పరిశ్రమ యజమానులకు బ్యాంకు సహకారం అందించాలి

తిరుపతి(కలెక్టరేట్), మే 28(ఆంధ్రజ్యోతి): మామిడి జ్యూస్ పరిశ్రమ యజమానులకు బ్యాంకు అధికారులు అన్ని విధాలుగా సహకారం అందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం బ్యాంకు అధికారులతో వర్చువల్ విధానంలో ఆయన సమీక్షించారు. మామిడిజ్యూస్ పరిశ్రమ యజమానులకు బ్యాంకువారు మంజూరు చేసిన రుణాలను రీషెడ్యూల్ చేసి వారికి సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజరు రవికుమార్, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.


శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.52 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 82,597

తలనీలాలు సమర్పించినవారు: 30,803



ఐదు పర్యాటక కేంద్రాల్లో యోగా ప్రచారం

● నేడు ఎస్వీ జూపార్కులో ప్రారంభం

తిరుపతి, మే 28 (ఆంధ్రజ్యోతి): జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజల్లో యోగాపట్ల అవగాహన పెంచేందుకు ముమ్మరంగా ప్రచారం చేపడుతున్నట్టు కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. పది లక్షల మందికి అవగాహన కల్పించాలని లక్ష్యం పెట్టుకున్నామన్నారు. బుధవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. పర్యాటక శాఖ ద్వారా జిల్లాలో ఐదు పర్యాటక కేంద్రాల్లో యోగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. అందులో భాగంగా గురువారం ఉదయం తిరుపతి ఎస్వీ జూపార్కులో మొదటి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జూన్ 4న చంద్రగిరి కోటలో, 11న శ్రీహరికోట అంతరిక్ష కేంద్రంలో, 17న శ్రీకాళహస్తిలో, 19న తిరుమల ఆస్థాన మండపంలో ఈ తరహా ప్రచార కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అటు పర్యాటకాన్ని, ఇటు యోగాను ప్రచారం చేసేలా ఈ కార్యక్రమాలు రూపొందించామని వివరించారు. ఇప్పటికే ఇంటింటి సర్వేతో ఆసక్తి ఉన్నవారి పేర్లు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు అవగాహన, శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగా ఢిల్లీలోని మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా ఆధ్వర్యంలో వివిధ శాఖలతో పాటు టీటీడీ, ఈశా ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలను భాగస్వామ్యం చేస్తున్నట్లు వివరించారు.

15న తిరుమలలో స్టేట్ ఈవెంట్

తిరుమలలో జూన్ 15వ తేదీన స్టేట్ లెవల్ ఈవెంట్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. ప్రతి జిల్లాలో రాష్ట్ర స్థాయి ఈవెంట్‌ను.. ఒక్కో ప్రత్యేక వర్గంతో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అందులో భాగంగా జిల్లాలో క్రీడా, సినిమా, సంగీత, సేవా రంగాలలోని ప్రముఖులతో తిరుమలలో సెలెబ్రిటీ యోగా డే నిర్వహిస్తామన్నారు. ప్రముఖులతో పాటు కనీసం ఐదు వేల మంది భక్తులు పాల్గొనేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు.

కన్నెర్రజేసిన కడలి

విద్యార్థినిని మింగేసిన అలలు - శ్రీనివాససత్రంలో బాలిక మృతి



పల్లవి (ఫైల్‌ఫొటో)

కోట, మే 28 (ఆంధ్రజ్యోతి): కడలి కన్నెర్రజేసింది.. సరదాగా గడిపేందుకు తల్లితో కలిసి సముద్ర తీరానికి వెళ్లిన బాలికను అలల రాకాసి మింగేసింది. కోట మండలం కొత్తపట్నం పంచాయతీ శ్రీనివాససత్రం గ్రామానికి చెందిన లక్ష్మయ్య, సౌమ్య దంపతుల కుమార్తె పల్లవి(12) ఎర్రావారిపాళెం మండలం ఉదయమాణిక్యంలోని జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. వేసవి సెలవులకు ఇంటికి వచ్చిన బాలిక బుధవారం గ్రామంలోని మరో ముగ్గురు స్నేహితులతో పాటు తల్లితో కలిసి గ్రామానికి సమీపంలో ఉన్న బీచ్‌లో సరదాగా గడిపేందుకు వెళ్లింది. సుమారు రెండు గంటలపాటు తీరంలో ఉల్లాసంగా గడిపారు. ఒక్కసారిగా భారీ అలలు వచ్చి ఒడ్డున ఉన్న పల్లవి సముద్రంలోకి లాక్కెళ్లాయి. అక్కడే ఉన్న తల్లి తన బిడ్డ సముద్రపు నీళ్లలో కొట్టుకుపోతుండడంతో హతాశులయ్యారు. వెంటనే గ్రామస్తులకు చెప్పడంతో స్థానికంగా ఉన్న గజఈత గాళ్లు పడవలు, బోట్లతో గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. గంటన్నర తరువాత ఒడ్డుకు చేరిన పల్లవిని గుర్తించి ఆఘమేఘాలపై చిల్లకూరు మండలంలోని చింతవరం ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి గూడూరు ప్రభుత్వాస్పత్రి తరలిస్తుండగా మృతి చెందింది. గ్రామంలో ఆడుతూ పాడుతూ అందరినీ అలరించే పల్లవి మృతితో శ్రీనివాససత్రంలో విషాద చాయలు అలుముకున్నాయి.







నడక మార్గానికి సమీపంలో ఏర్పాటు చేసిన కెమెరా ట్రాప్స్ - కెమెరా ట్రాప్స్ పనితీరును పరిశీలిస్తున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి

భక్తుల సంరక్షణే లక్ష్యంగా పనిచేయండి

● నడకమార్గాల్లో నిరంతర నిఘా ఉండాలి

● అటవీశాఖ అధికారులకు అదనపు ఈవో ఆదేశం



ఎస్ఎస్ టెంపుల్ వద్ద ఫారెస్ట్‌లో అధికారులతో మాట్లాడుతున్న అదనపు ఈవో

తిరుమల, మే28(ఆంధ్రజ్యోతి): తిరుమలకు వచ్చే భక్తుల సంరక్షణే లక్ష్యంగా ఫారెస్ట్, విజిలెన్స్ అధికారులు, సిబ్బంది పనిచేయాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆదేశించారు. వన్యమృగాల బారినపడి ఏ భక్తుడికి హాని జరగడానికి వీల్లేదన్నారు. నడక మార్గాలతో పాటు ఘాట్‌రోడ్లలో నిరంతర నిఘా ఉంచాలన్నారు. వరుస చిరుతల సంచారం నేపథ్యంలో బుధవారం ఆయన అలిపిరి నడకమార్గంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం(ఎస్ఎస్ టెంపుల్) వద్ద తనిఖీలు నిర్వహించారు. చిరుతల సంచారం అధికంగా ఉండే ఏడోమైలు నుంచి ఎస్ఎస్ టెంపుల్ వరకు నడకమార్గానికి ఇరువైపులా ఏర్పాటు చేసిన కెమెరా ట్రాప్స్‌ను పరిశీలించారు. వాటి పనితీరు గురించి ప్రభుత్వ అటవీశాఖ అధికారులు ఆయనకు వివరించారు. స్టాటిక్ కెమెరాలు, మోషన్ సెన్సార్ కెమెరాలు ఎలా ఉపయోగపడుతున్నాయనేది తెలియజేశారు. ఈనెల 21వ తేదీన ఎస్ఎస్ టెంపుల్ వద్ద కెమెరాకు చిక్కిన ఓ చిరుత దృశ్యాలను పరిశీలించారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ.. సోలార్ కెమెరాలకు బూస్టర్లను ఫిక్స్ చేయడం ద్వారా అవి నిరంతరాయంగా పనిచేస్తాయని సూచించారు. కెమెరాల ముందు కనిపించే వన్యమృగాల సమాచారాన్ని టీటీడీ ఫారెస్ట్, విజిలెన్స్ విభాగాలకూ తెలియజేసి సమన్వయంగా భక్తులను అప్రమత్తం చేయాలని ప్రభుత్వ ఫారెస్ట్ అధికారులను కోరారు. అవసరమైతే మరికొన్ని కెమెరా ట్రాప్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. దీనికి టీటీడీ సహకారం ఉంటుందన్నారు. నడక మార్గాల్లో భద్రతా సిబ్బందిని పెంచాలన్నారు.

చిరుతను ఢీ కొన్న వాహనం

● తీవ్ర గాయాలతో పాడుపడిన కోనేరులో మృతి

● ఆలస్యంగా వెలుగులోకి..



పాడుబడిన కోనేరు వద్ద చిరుత కళేబరం

చంద్రగిరి, మే 28(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన చిరుత.. చంద్రగిరి మండలం ఎ.రంగంపేట సమీపంలోని మామిడి తోటలో పాడుపడిన కోనేరులో మృతి చెందింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. హరిప్రసాద్‌రెడ్డి మామిడితోటలోని కోనేరులో చిరుత కళేబరాన్ని బుధవారం గొర్రెల కాపరి గుర్తించారు. ఈ సమాచారం మేరకు నాగపట్ల అటవీ సిబ్బంది కోనేరును పరిశీలించి, ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. సాయంత్రం 5 గంటల సమయంలో తిరుపతి ఎస్వీ జూపార్క్ వైద్యులు తోయబ సింగ్, నారావారిపల్లె వెటర్నీ డాక్టర్ వంశీ సంఘటనా స్థలంలోనే చిరుతకు పోస్టుమార్టం చేశారు. ఇది చిరుత చిరుత అని, సుమారు ఏడాది వయసు ఉంటుందని, ఎడమ వైపు మెడ దగ్గర, ఎడమ కాలు దగ్గర కమిలిన గాయాలు ఉన్నట్లు వైద్యులు తెలిపారు. చిరుత శరీర భాగాలు, కాళ్ళు, గోళ్ళు, దంతాలు, చర్మం, బాగానే ఉన్నాయన్నారు. వారం కిందట వాహనం ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయని, మూడు రోజుల కిందట కోనేరు వద్దకు వచ్చి మృతి చెందిందనట్లుగా భావిస్తున్నారు.

పసుపు జాతర



వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ పుస్తకావిష్కరణ



వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ బుక్ చూస్తున్న అచ్చెన్నాయుడు



వేదికపై ఎమ్మెల్యే ఆర్.మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి



రక్తదానం చేసిన వారికి షీల్డు అందిస్తున్న దృశ్యం



మహానాడులో ప్రత్యేక ఆకర్షణ ఎన్టీఆర్ వేషధారి..







రాయలసీమ నడిబొడ్డున ఉన్న కడపగడపలో టీడీపీ నిర్వహిస్తున్న మహానాడు జనజాతరను తలపిస్తోంది. రెండోరోజు బుధవారం సైతం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో సందడి నెలకొంది. వందల కిలోమీటర్ల నుంచి యువకులు సైకిళ్లపై వచ్చి టీడీపీపై తమ అభిమానం చాటుకున్నారు. యువతులు, మహిళలు పసుపుచీరలు, పచ్చ తలపాగాలతో సందడి చేశారు. దాదాపు లక్షమందికి భోజన ఏర్పాట్లు చేశారు. 'ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి' అంటూ అందరూ భోజనాలను ఆస్వాదించారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం'పాదయాత్ర అనుభవాలతో తీసుకొచ్చిన 'వాయిస్ ఆఫ్ నారా లోకేశ్' పుస్తకాన్ని నారా చంద్రబాబు ఆవిష్కరించడంతో కార్యకర్తలు కేరింతలు కొట్టారు. కడప నగరం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో కిటకిటలాడింది. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



మంత్రి సవిత ఆధ్వర్యంలో అనంతపురం నుంచి సైకిళ్లపై వచ్చిన కార్యకర్తలు









నోరూరించే వంటలు రెడీ...



మహానాడు ప్రాంగణం వద్ద వాహనాల రద్దీ



అనంతపురం నుంచి సైకిల్ ర్యాలీగా వచ్చిన వారితో మహిళలు



మేము విజిలేస్తే...



కార్యకర్తల ఉత్సాహం..



రక్తదానం చేస్తున్న కార్యకర్తలు



పోలీసు తనిఖీలు

రూ.17,809.37 కోట్లతో రుణప్రణాళిక

చిత్తూరు కలెక్టరేట్, మే 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర అభివృద్ధికి దోహదపడేలా సంబంధిత వార్షిక రుణప్రణాళికను జిల్లా బ్యాంకర్ల సమన్వయ కమిటీ సమావేశంలో బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ విడుదల చేశారు. 2025-26 రుణప్రణాళికలో జిల్లా ప్రజల రుణసామర్థ్యం, గ్రామీణ అభివృద్ధికి పెద్దపీట వేశారు. ప్రాధాన్య రంగాలకు రుణ పరపతి కల్పించడం, మౌలిక వసతుల వినియోగంలో అంతరాలను తగ్గించడం, స్థిరమైన వ్యవసాయాభివృద్ధిని ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ ప్రణాళికను తయారు చేశారు.

● ప్రధాన అంశాలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 8,15,145 ఖాతాలకు రూ.17,809.37 కోట్లు అందించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ప్రాధాన్యతా రంగాలకు రూ.15,022.20 కోట్లు, ప్రాధాన్యేతర రంగాలకు రూ.2777.17 కోట్లు కేటాయించారు. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ మొత్తం రుణ ప్రణాళికలో 68.4శాతం మొత్తాలను కేటాయింపు జరిగింది. రూ.12,195.27 కోట్లను 6.38 లక్షల రైతాంగానికి రుణ ప్రణాళిక ద్వారా లబ్ధి చేకూర్చనున్నారు. చిన్న, సూక్ష్మ పరిశ్రమల రంగానికి రూ.2216.07 కోట్లు (12.44శాతం), ఇతర ప్రాధాన్యరంగాలకు రూ.220.81 కోట్లు (1.35శాతం) కేటాయింపులు జరిగాయి. వాణిజ్య రంగ బ్యాంకుల షేర్‌రూపంలో రూ.11,843.43 కోట్లు (66.50శాతం), ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు షేర్ రూ.4594.28 కోట్లు (25.79 శాతం), జిల్లా సహకార కేంద్రబ్యాంకు షేర్ రూ.1233.59కోట్లు (6.90శాతం), ఇతర చిన్నతరహా బ్యాంకుల షేర్ రూ.138.07 కోట్లు (0.77శాతం) కేటాయింపులుజరిగాయి. 2024-25లో రుణప్రణాళిక లక్ష్యం రూ.13,396.48 కోట్లు కాగా, లక్ష్యానికి మించి రూ. 14,478.26 కోట్ల వితరణ జరిగింది. జిల్లాలో వేరుశనగ, చెరకు, మామిడి, టమోటా, అరటి, వరి పంటలను ప్రధాన పంటలుగా గుర్తించారు.

● రంగాలవారీ విభజన

సింగిల్ విండోల ఆధునికీకరణ, బహుళ సేవాకేంద్రాల ఉన్నతీకరణకు మద్దతుగా నిలుస్తారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయడం, సామర్థ్యం పెంచడం, ఆర్థిక అనుసంధానం కోసం నాబార్డు అనుబంధ సంస్థల నుంచి మద్దతు ఇవ్వాలని ప్రణాళికలో పేర్కొన్నారు. ఆర్బీఐ ఏజీఎం ఆర్వో (ఆంధ్రప్రదేశ్) రోహిత్ అగర్వాల్, ఎల్డీఎం హరీష్, నాబార్డు డీడీఎం సునీల్, డీసీసీ కన్వీనర్ ఇంద్రరా, జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన రెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ, డీసీసీబీ సీఈవో శంకర్ బాబు, వివిధ బ్యాంకుల కంట్రోలింగ్ అధికారులు, ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.


రుణప్రణాళికను విడుదల చేస్తున్న కలెక్టర్, పాల్గొన్న ఎల్డీఎం, నాబార్డు, ఇతర అధికారులు

డీసీసీబీలో సెక్షన్ 51 విచారణ పూర్తి

● రేపో, మాపో కలెక్టర్‌కు నివేదిక

చిత్తూరు కలెక్టరేట్, మే 28 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు గత పాలకవర్గం చేసిన ఆర్థిక అవినీతి, అక్రమాలపై సహకారచట్టం సెక్షన్-51 కింద జరిగిన విచారణ ఎట్టకేలకు పూర్తయ్యింది.దాదాపు 80 మందికి విచారణ అధికారి సమన్లు పంపగా చిత్తూరు డీసీసీబీ ప్రధాన కార్యాలయానికి అందరూ హాజరై తమ వాంగ్మూలాలను ఇచ్చారు.డీసీసీబీలో గత ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్న ఆర్థిక అవకతవకలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు నివేదిక పంపాలని సూచించారు. దాంతో విచారణ అధికారిగా కలెక్టర్‌చే నియమితులైన డీఆర్వో మోహన్‌కుమార్ గతనెల 21వ తేది సెక్షన్-51పై 80మందికి నోటీసులు జారీ చేస్తూ విడతలవారీగా విచారణకు హాజరై తమ వాంగ్మూలాలను అందించారు. కాగా ఈనెల ప్రారంభంలో విచారణ పూర్తయ్యింది. విచారణ నివేదిక తయారైంది. రేపోమాపో కలెక్టర్‌కు విచారణ అధికారి, డీఆర్వో మోహన్‌కుమార్ అందజేయనున్నట్లు సమాచారం.

రోడ్డు రోలరును ఢీకొని యువకుడి మృతి

విజయపురం, మే 28(ఆంధ్రజ్యోతి): నిలిపి ఉన్న రోడ్డు రోలరును ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు.పోలీసుల కథనం మేరకు ...విజయపురం మండలం ఇష్టకామేశపురానికి చెందిన తమిళ్ సెల్వం(24) వ్యక్తిగత పనుల నిమిత్తం కనకమ్మ సత్రం వద్దకు ద్విచక్రవాహనంలో బయల్దేరాడు. మార్గమధ్యంలోని పన్నూరు దళితవాడ సమీపంలో స్పీడు బ్రేకర్ వద్ద ఆగి ఉన్న రోడ్డు రోలరును ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రంగా తెలిపారు.


మృతి చెందిన తమిళ్‌సెల్వం

వాహనాల చోరీ ముఠా అరెస్టు

● నిందితుల్లో ఓ బాలుడు


నిందితులను అరెస్టు చూపిస్తున్న పోలీసులు

గుడిపాల, మే 28(ఆంధ్రజ్యోతి): వాహనాలను దొంగలించే ముఠాను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ. 18లక్షల విలువ చేసే వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఎస్ఐ రామ్మోహన్ తెలిపిన వివరాలివి.. ఈ నెల 16న పానాటూరుకు సమీపంలోని ఓ గ్రానైట్‌ఫ్యాక్టరీ వద్ద తుమ్మల వారిపల్లెకు చెందిన బాలకృష్ణమ్మనాయుడి ట్రాక్టర్, ట్రాలీలను దొంగలు ఎత్తుకుపోయారు. దీనిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతికతను వినియోగించి దొంగలు ఎత్తుకెళ్లిన వాహనాలను సీసీఫుటేజీ ద్వారా గుర్తించారు. బుధవారం చీలాపల్లె క్రాస్ వద్ద కలికిరి మండలం కురప్పల్లెకు చెందిన అవినాష్‌రెడ్డి, పారపట్లకు చెందిన నితీష్‌కుమార్‌రెడ్డి, కలికిరికి చెందిన ఓ మైనర్ బాలుడి నుంచి ట్రాక్టర్, ట్రాలీ, ఆరు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

మైనర్ బాలుడే.. మహాఘనుడు

ట్రాక్టర్, ట్రాలీ కేసులో నిందితుడిగా మైనర్ బాలుడు ఉన్నాడు. తొమ్మిదవ తరగతి వరకు చదువుకున్నాడు. చిన్నతనంలోనే తండ్రి చనిపోయాడు. కుటుంబ పోషణ కోసం తల్లి దుబాయ్‌కి వెళ్లింది. దీంతో సరైన పర్యవేక్షణ లేక ఆ మైనర్ జల్సాలకు అలవాటు పడ్డాడు. చిన్నచిన్న దొంగతనాల నుంచి పెద్ద దొంగతనాలకు పాల్పడ్డాడు. ఇప్పటికే వాయల్పాడు, మదనపల్లె వన్‌టౌన్, మదనపల్లె టూ టౌన్, మదనపల్లె తాలూకా పోలీసు స్టేషన్లలో ఈ కుర్రాడిపై 15కేసులు నమోదయ్యాయి. ఇది వరకు పట్టుబడినా మైనర్ కావడంతో ప్రతిసారి రెండు నెలలపాటు తిరుపతి జువైనల్‌హోమ్‌లో ఉంచుతున్నారు. తిరిగి బయటికి వచ్చి మళ్లీ దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలోనే తాజాగా ట్రాక్టర్ దొంగతనం కేసులో జువైనల్ హోమ్‌కు పోలీసులుతరలించారు.

చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి 3న డీఎస్‌హెచ్ అధికారుల టీం

చిత్తూరు రూరల్, మే 28(ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్(డీఎస్‌హెచ్)అధికారులు జూన్ 3వ తేదిన సందర్శించనున్నారు. డీఎస్‌హెచ్ జాయింట్ కమిషనర్ రమేష్‌నాథ్, డిప్యూటీ కమిషనర్ రమేష్ కిషోర్, సెక్రటరీ పద్మాకుమారి, ఈఈ విజయభాస్కర్, బయో మెడికల్ ఇంజనీర్ సందీప్‌రెడ్డి కలిసి తనిఖీకి రానున్నారు. ఆస్పత్రిలోని వైద్యులు, అధికారులు, సిబ్బంది ఆ రోజున సెలవు పెట్టొద్దని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

తెలుగుగంగ ఎస్ఈగా విజయ్‌కుమార్‌రెడ్డి

తిరుపతి, మే 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతి తెలుగుగంగ ప్రాజెక్టు ఎస్ఈగా పి.విజయ్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. జలవనరుల శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పనిచేస్తున్న ఆయనకు ప్రభుత్వం తాత్కాలిక ప్రాతిపదికన ఎస్ఈగా పదోన్నతి కల్పించింది. ఆ పదోన్నతిపై ఆయనను తిరుపతి తెలుగు గంగ ప్రాజెక్టు, గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టుల సర్కిల్‌కు బదిలీ చేసింది.

తిరుపతి కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు


కలెక్టరేట్‌లో పార్కింగ్‌లో ఉన్న వాహనాలను తనిఖీ చేస్తు బాంబ్ స్క్వాడ్

తిరుపతి(కలెక్టరేట్), మే 28(ఆంధ్రజ్యోతి): తిరుపతి కలెక్టరేట్‌కు రెండోసారి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. జైస్మాల్ ముస్తాక్ సవుక్కు శంకర్ మద్రాస్ టైగర్స్ పేరిట జేసీ శుభం బన్సల్‌కు మంగళవారం సాయంత్రం అధికారికంగా మెయిల్ చేశారు. పాక్ జిందాబాద్.. జిల్లా కలెక్టరేట్‌లో ఆర్‌డీఎక్స్ అమర్చామని అందులో పేర్కొన్నారు. అందులో సోమవారం మధ్యాహ్నం 1.13 గంటలకు బాంబులు పేలేలా అమర్చామని ఉండటం గమనార్హం. వెంటనే అధికారులు ఈ మెయిల్‌ను ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు ఫార్వార్డ్ చేసి సమాచారం ఇచ్చారు. సీసీ కెమెరాల పుటేజీలు పరిశీలించిన పోలీసు అధికారులు ఎలాంటి అనుమానాస్పద అంశాలూ లేవని నిర్ధారించుకున్నారు. బుధవారం ఉదయం ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. పార్కింగ్‌లోని వాహనాలను తనిఖీ చేశారు. అన్ని విభాగాల్లోనూ తనిఖీచేసిన బాంబు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది చివరికి అంతా ఉత్తిదేనని తేల్చడంతో కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు. గతంలోనూ మార్చి 21న ఇదే తరహాలో బాంబు బెదిరింపు మెయిల్ వచ్చిన విషయం తెలిసిందే.

తుడా అకౌంట్స్‌ను డిజిటలైజ్ చేయండి

● కాగ్ బృందం సూచన


సమావేశంలో మాట్లాడుతున్న కాగ్ సభ్యులు

తిరుపతి, మే 28(ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)ను బుధవారం భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) బృందం సందర్శించింది. కాగ్ బృంద సభ్యులు రీషూ ప్రకాష్, రష్మీ అగర్వాల్, ఎన్వీ నిఖిల, ఆర్ శ్యామ్‌లు తుడా అధికారులతో సమావేశమయ్యారు. తుడా చేపడుతున్న పనులను వీసీ మౌర్య వివరించారు. తుడా పాటిస్తున్న అకౌంటింగ్ విధానాలను డిజిటలైజేషన్ చేయడానికి చర్యలు తీసుకోవాలని కాగ్ బృందం సూచించింది. ఈ సమావేశంలో తుడా కార్యదర్శి డాక్టర్ శ్రీకాంత్ బాబు, ఎస్ఈ కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





టీడీపీ అధ్యక్షుడిగా మరోసారి ఎన్నికైన చంద్రబాబుకు శుభాకాంక్షలు చెబుతున్న శాప్ చైర్మన్ రవినాయుడు, మహానాడు వేదికపై చిత్తూరు, తిరుపతి పార్లమెంటు నియోజకవర్గాల టీడీపీ అధ్యక్షులు సీఆర్ రాజన్, నరసింహయాదవ్‌లతో చీమనేని చిట్టిబాబు, నారా లోకేశ్‌తో చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్, మహానాడు ఆవరణలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రాంతీయ పార్టీ అయినా జాతీయ భావాలున్న టీడీపీ

● మహానాడులో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

గంగవరం, మే 28(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రాంతీయ పార్టీ అయినప్పటికీ జాతీయ భావాలు కలిగిన పార్టీ అని, కేంద్రంలో ఎన్నోసార్లు చక్రం తిప్పిన ఘనత టీడీపీది అని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు.కడపలో జరుగుతున్న మహానాడులో రెండవరోజైన బుధవారం ఆయన రాజకీయ తీర్మానాలను బలపరుస్తూ ప్రసంగించారు.తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా పార్టీని చంద్రబాబు దిగ్విజయంగా నడిపిస్తున్నారని కొనియాడారు. ఎన్నికల ముందు లోకేశ్ యువగళం పేరుతో పాదయాత్ర ప్రారంభిస్తే వైసీపీ సర్కారు అడుగడుగునా అడ్డంకులు సృష్టించిందన్నారు. అవేవీ లెక్కచేయకుండా ఆయన కుప్పం నుంచి విశాఖ ద్వారా పాదయాత్రను దిగ్విజయంగా పూర్తి చేశారన్నారు. యువగళంతో మొదలై ఎన్నికల్లో భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చేంతవరకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేశారన్న విషయం గుర్తించాలన్నారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు సాగునీరందించి ఉపాధి అవకాశాలను కల్పించిన ఘనుడు చంద్రబాబు అన్నారు.ఆధునిక రాజకీయ తత్వశాస్త్రం తెలిసిన ఎన్నో ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు ప్రస్థానాన్ని ఒక పాఠ్యాంశంగా తీసుకోవాలని సూచించారు.


మహానాడులో మాట్లాడుతున్న అమరనాథ రెడ్డి

92మంది ఎంపీహెచ్ఏలకు కౌన్సెలింగ్


డీఎంహెచ్‌వో కార్యాలయంలో కౌన్సెలింగ్ కోసం వేచిఉన్న ఎంపీహెచ్ఏలు

చిత్తూరు రూరల్, మే 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఎంపీహెచ్ఏ(మేల్)కు డీఎంహెచ్‌వో సుధారాణి కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లాలో మలేరియా, డెంగ్యూ అధికంగా ఉన్న ప్రాంతాల్లో(హైరిస్క్ ప్రాంతాల్లో)ని పీహెచ్‌సీల్లో నియమించేందుకు ఈ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 92 మందికి కౌన్సెలింగ్ నిర్వహించిన డీఎంహెచ్‌వో 30వ తేదిన పోస్టింగ్ ఆర్డర్ కాపీలు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఐవో వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా థియేటర్లలో తనిఖీలు

● ఫైర్ సర్టిఫికెట్ లేకుండానే కొన్ని నిర్వహణ

● రెవెన్యూ తనిఖీల్లో బయటపడ్డ నిజాలు

చిత్తూరు రూరల్, మే 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా సినిమా థియేటర్లలో రెవెన్యూ అధికారులు బుధవారం తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. కొన్ని థియేటర్లు లైసెన్సు లేకుండా నడుస్తుంటే మరి కొన్ని ఫైర్ సర్టిఫికెట్ లేకుండా నిర్వహిస్తున్నారు. కొత్త థియేటర్లతో పోలిస్తే పాత థియేటర్ల పరిస్థితి అధ్వానంగా ఉందని అధికారుల తనిఖీలో బట్టబయలైంది. చాలా థియేటర్లలో ప్రేక్షకులకు కనీసం తాగునీరు కూడా ఏర్పాటు చేయడం లేదని, మరుగుదొడ్ల దుర్వాసన వెదజల్లుతున్నట్లు గుర్తించారు. సినిమా టికెట్ రేట్ల కన్నా పాప్‌కార్న్, తినుబండారాల ధరలు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ ఫీజు ద్విచక్రవాహనానికి రూ.20, కారుకు రూ.40 చొప్పున వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. చిత్తూరు నగరంలో మొత్తం 6 థియేటర్లను రెవెన్యూ అధికారులు తనిఖీ చేశారు. ఇందులో రాఘవ, ఎంఎస్ఆర్ థియేటర్లకు ఫైర్ సర్టిఫికెట్ లేదని గుర్తించారు. అలాగే మరుగుదొడ్లు అధ్వానంగా వుండడాన్ని గుర్తించారు. తినుబండారాలను అన్ని థియేటర్లలో అధిక ధరలకే విక్రయిస్తున్నారని తేలింది.బయట 10రూపాయలకు అమ్మే పాప్‌కార్న్ థియేటర్లలో రూ.100కు అమ్ముతున్నట్లు అధికారులు గుర్తించారు. వాటర్ బాటిల్ కూడా ఎంఆర్‌పీ కన్నా అధికంగా విక్రయిస్తున్నారని గుర్తించారు. ఎంఆర్‌పీ ఛార్ట్‌లో అన్ని తినుబండారాల ధరలు ఉండాల్సిన దానికన్నా అధికంగా ఉన్నట్లు గమనించారు. ఫస్ట్ ఎయిడ్ కిట్లు, శానిటేషన్ సర్టిఫికెట్లు లేవని తనిఖీల్లో బయటపడిందన్నారు. తనిఖీల్లో పాల్గొన్న చిత్తూరు అర్బన్ తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం సూచించిన 29 అంశాలపై తనిఖీలు నిర్వహించామన్నారు. గత నెలలో నిర్వహించిన తనిఖీల్లో కూడా పార్కింగ్ ఫీజు వసూలు చేయకూడదని నిర్వాహకులను హెచ్చరించినా వసూలు చేస్తున్నట్లు గుర్తించామన్నారు.పూర్తి నివేదికను కలెక్టర్‌కు పంపించామన్నారు.


చిత్తూరు ఎంఎస్ఆర్ థియేటర్‌లో తనిఖీలు


చిత్తూరు రాఘవ థియేటర్‌లో తనిఖీ అధికారులు

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు: ఇద్దరి మృతి

బంగారుపాళ్యం,మే 28(ఆంధ్రజ్యోతి): చెన్నై-బెంగుళూరు జాతీయ రహదారిలోని బసప్పా డాబా వద్ద బుధవారం రాత్రి కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. బంగారుపాళ్యం మండలం పెరుమాళ్ళపల్లెకు చెందిన రమేష్, చిత్తూరు కొంగారెడ్డిపల్లెకు చెందిన అమరేంద్రబాబు పలమనేరు వైపు వెళ్ళే రహదారి వైపున్న ఓ డాబాలో భోజనం చేసి తిరిగి బంగారుపాళ్యం రావడానికి ద్విచక్రవాహనంలో రోడ్డు దాటుతుండగా పలమనేరు వైపు వెళుతున్న కారు వారి వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో రమేష్ (43), అమరేంద్రబాబు(48) అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి పోలీసులు తరలించారు.



రమేష్ (ఫైల్‌ఫోటో) - ప్రమాదంలో మృతి చెందిన అమరేంద్రబాబు

వ్యవసాయ కళాశాలకు బాంబు బెదిరింపు

తిరుపతి (నేరవిభాగం), మే 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని వ్యవసాయ కళాశాలకు మూడోసారి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. శివదాస్ మీనా అనే పేరుతో ఉదయం 9 గంటలకు ఈ మెయిల్ అందింది. అందులో అఫ్జల్ గురూను ఉరి తీసినందుకు, తమిళనాడులో సవుక్కు శంకర్ పట్ల డీఎంకే వ్యవహరించిన తీరుకు నిరసనగా కాలేజీలో పైప్ బాంబులు అమర్చినట్టు పేర్కొన్నారు. ఇవి ఏ క్షణమైనా పేలే అవకాశాలున్నాయని ఆ మెయిల్‌లో హెచ్చరించారు. ఈ మెయిల్ విషయమై రూరల్ సీఐ చిన్నగోవిందుకు అధికారులు సమాచారం ఇచ్చారు. పోలీసులు, డాగ్, బాంబు స్క్వాడ్ సిబ్బంది కళాశాలకు చేరుకుని ప్రిన్సిపల్, డీన్, రిజిస్ట్రార్ చాంబర్లతో పాటు తరగతి గదులు, హాస్టళ్లు, ల్యాబ్‌లు, కళాశాల చుట్టుపక్కల ప్రాంతాల్లో బాంబు డిస్పోజల్ పరికరాలతో తనిఖీ చేశారు. ఎలాంటి బాంబులు లేవని అంతా ఫేక్ మెయిల్స్ అని తేల్చారు. ఈ వ్యవసాయ కళాశాలకు బాంబు బెదిరింపు మెయిల్ రావడం ఇది మూడోసారి.


కళాశాలలో బాంబు స్క్వాడ్ తనిఖీలు

ఎస్వీయూ పరీక్షల డీన్‌గా సురేంద్రబాబు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 28 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరీక్షల డీన్‌గా ప్రొఫెసర్ కొంగర సురేంద్రబాబు నియమితులయ్యారు. ఇప్పటివరకూ పరీక్షల డీన్‌గా వ్యవహరించిన ప్రొఫెసర్ కిషోర్ స్థానంలో ఆయన్ను నియమించారు. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు నుంచి బుధవారం ఆయన నియామక ఉత్తర్వులు స్వీకరించారు. చంద్రగిరి మండలం పాండురంగవారిపల్లెకు చెందిన సురేంద్రబాబు ప్రస్తుతం లైబ్రరీ సైన్స్ డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా ఉన్నారు. యూనివర్సిటీ ప్రధాన గ్రంథాలయం డైరెక్టర్‌గా, ఏపీపీజీసెట్-2025 కో-కన్వీనర్‌గా పనిచేస్తున్నారు. లైబ్రరీ సైన్స్ డిపార్ట్‌మెంట్‌లో 25 ఏళ్లుగా అధ్యాపకత్వం వహించారు. 52 పరిశోధనా వ్యాసాలు, 2 పుస్తకాలు రాశారు. గురువారం బాధ్యతలు స్వీకరించనున్న సురేంద్రబాబును పలువురు అభినందించారు.


నియామకపత్రం అందుకుంటున్న సురేంద్రబాబు

శ్రీవారి సేవలో ప్రభుత్వ విప్

తిరుమల, మే 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. అనంతరం రంగనాయక మండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వచనం చేసి, ప్రసాదాలు అందజేశారు.


ఆలయం ముందు ఉమామహేశ్వరరావు

గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

తిరుమల, మే 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో జూన్ 2 నుంచి 10వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలకు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిని ఆహ్వానించారు. ఈ మేరకు తిరుమలలోని క్యాంపు కార్యాలయంలో ఆలయాధికారులు, అర్చకులు బుధవారం ఆయన్ను కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలని, భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని చైర్మన్ వారికి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో శాంతి పాల్గొన్నారు.

తిరుచ్చిపై రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు



చంద్రగిరి, మే 28(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు ఉత్సవర్లు భక్తులకు దర్శనమిచ్చారు. నిత్య సేవల్లో భాగంగా ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవర్లకు ఊంజల్ సేవ కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణుడు ఉత్సవర్లను విశేషంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిష్ఠించారు. ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రమేష్‌కుమార్, రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణా చార్యులు, పార్థసారథి, జమేదార్ చిరంజీవి పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం



రామకుప్పం, మే 28(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం అయ్యప్పగానిపల్లెకు చెందిన గంగాధర్ మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. టీడీపీ రామకుప్పం పంచాయతీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచు గంట్లరెడ్డి బుధవారం గంగాధర్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబసభ్యులకు పార్టీ తరపున రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కోదండరెడ్డి, సురేష్, రాధప్ప, శంకరప్ప, వెంకటరమణ, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు. ● స్థానిక కావడి భజనబృందం సభ్యులు గంగాధరం కుటుంబ సభ్యులకు రూ.10వేలు అందజేశారు.

ఘనంగా ఎన్‌టీఆర్ జయంతి



పెద్దపంజాణి, మే 28(ఆంధ్రజ్యోతి): పెద్దపంజాణి ఎంపీడీవో కార్యాలయంలో ఎన్‌టీఆర్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. అధికారులు, టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీపీ రెడ్డెప్ప, ఎంపీడీవో బాలాజి, టీడీపీ నాయకులు చెంగారెడ్డి, చలపతి, గంగప్ప, వెంకట్రమణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఆరోగ్యం



పెద్దపంజాణి, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి నిత్యం యోగా సాధనతోనే మానసిక ఆరోగ్యం సాధ్యమని ఎంపీడీవో బాలాజీ తెలిపారు. సచివాలయ ఉద్యోగులకు యోగాపై మూడు రోజుల శిక్షణా తరగతులను బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన ప్రారంభించారు.

డిజిటల్ నైపుణ్యాలు పెంచుకోండి



పెద్దపంజాణి, మే 28(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులందరూ డిజిటల్ నైపుణ్యాలు పెంచుకోవాలని ఏవో రబీబా తెలిపారు. బుధవారం మండలంలోని రాయలపేట రైతు సేవా కేంద్రంలో డిజిటల్ నైపుణ్యాలపై రైతులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్మార్ట్‌ఫోన్ ఆధారిత వ్యవసాయ సమాచారం, యూపీఐ లావాదేవీలు, ఫోన్‌పే, గూగుల్‌పే వంటి సేవల వినియోగం, రోజువారీ మార్కెట్ ధరలు తెలుసుకునే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

మహానాడుకు తరలిన తెలుగు తమ్ముళ్లు



గంగవరం,మే28(ఆంధ్రజ్యోతి): గంగవరం మండలం నుంచి భారీ సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు మహానాడుకు పయనమయ్యారు. మండల టీడీపీ అధ్యక్షులు సోమశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో సుమారు 10 వాహనాల్లో మండలంలోని అన్ని పంచాయతీలకు చెందిన నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు వెళ్లారు. వెళ్లినవారిలో కల్లుపల్లె సర్పంచ్ రామ్మోహన్‌నాయుడు, టీడీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, హరికృష్ణ, సుబ్బారెడ్డి, సురేష్‌నాయుడు ఉన్నారు.



బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె నుంచి టీడీపీ సీనియర్ నాయకుడు జైకుమార్, మండలంలోని పలువురు టీడీపీ నాయకులు మహానాడుకు తరలివెళ్లారు.

తెలుగు జాతి ఉన్నంత వరకు ఎన్‌టీఆర్ ఉంటారు



బైరెడ్డిపల్లె, మే 28 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలో బుధవారం టీడీపీ వ్యవస్థాపకులు ఎన్‌టీఆర్ జయంతి వేడుకలను టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూజలు నిర్వహించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నష్టపరిహారం పెంచాలి

బైరెడ్డిపల్లె, మే 28 (ఆంధ్రజ్యోతి): బైపాస్ రోడ్డుతో భూములు కోల్పోతున్న తమకు నష్టపరిహారం పెంచాలని బైరెడ్డిపల్లెలో బైపాస్‌రోడ్డు బాధిత రైతులు కోరారు. భూ ములు కోల్పోతున్న రైతులతో బుధవారం పలమనేరు ఆర్డీవో భవాని స్థానిక రెవిన్యూ కార్యాలయంలో సమావేశం ఏర్పాటుచేశారు. రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ప్రసన్నకుమార్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో దీర్ఘకాలిక రోగాలు దూరం



పుంగనూరు రూరల్, మే28(ఆంధ్రజ్యోతి): యోగా చేయడం వల్ల దీర్ఘకాలిక రోగాలు దూరమవడానికి అవకాశాలు ఉన్నాయని డాక్టర్లు మానస, శివశంకర్‌లు తెలిపారు. బుధవారం స్థానిక బ్రాహ్మణవీధిలోని సాయిబాబా ఆలయ సమీపంలో ధ్యానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా, ధ్యానంతో ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. యోగా శిక్షకులు చక్రపాణి, వేణు, విజయ్, హరిప్రసాద్, వెంటేశ్, రాధ, భవాని, నారాయణ, నాగరాజ పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మకమలాలు



సోమల, మే 28 (ఆంధ్రజ్యోతి): సోమల సాయినగర్‌లోని ఆర్మీ విశ్రాంత అధికారి పీఎస్. సోమశేఖర్ ఇంటి ఆవరణంలోని బ్రహ్మకమలాలు బుధవారం వికసించాయి. మొత్తం 23 పుష్పాలు వికసించాయి. బ్రహ్మకమలాలను సాయిబాబా ఆలయం, శివాలయాల్లో స్వామివార్లకు అర్పించి పూజలు చేశారు.

ఆకట్టుకున్న కురుక్షేత్ర ఘట్టం

సోమల, మే 28 (ఆంధ్రజ్యోతి): నంజంపేట గార్గేయ నదీతీరం గార్గేయ గౌరీలింగేశ్వరస్వామి ఆలయం వద్ద జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా బుధవారం పగలు భాగవతారణి రత్నకుమారి వివరించిన కురుక్షేత్ర ఘట్టం భక్తులను అలరించింది. రాత్రి రాయలపేట నాటక మండలి వారు కురుక్షేత్రంలోని ముఖ్య ఘట్టాలను నాటిక రూపంలో ప్రదర్శించారు. కమ్మపల్లె, నంజంపేట, గట్టువారిపల్లె, ఆవులపల్లె తదితర గ్రామాల భక్తులు పాండవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ దర్మకర్త గుత్తా జయలలితమ్మ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ప్రతిష్ఠకు రూ. 5లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న దాత కిరణ్ రాయల్

సోమల, మే 28 (ఆంధ్రజ్యోతి): సోమలలోని శ్రీకృష్ణదేవరాయులు సర్కిల్లో ఆయన విగ్రహ ప్రతిష్ఠకు వల్లిగట్ల పంచాయతీ పెద్దూరుకు చెందిన సాకిబండ కిరణ్‌రాయల్ రూ.5లక్షలు విరాళం అంద జేసినట్లు కమిటీ అధ్యక్షుడు ఎన్. మునివెంకటప్ప తెలిపారు. అలాగే నంజంపేటకు చెందిన కే. మురళీ రూ.20 వేలు, టి.రెడ్డిప్రసాద్ రూ 10వేలు, కే.మునిరత్నం రూ. 10 వేలు, కె.చక్రవర్తి రూ. 5వేలు, పేటూరుకు చెందిన పొంగు బాల దేశయ్య, చిట్టిబాబు రూ.20 వేలు, పట్టుసిరి సుబ్రహ్మణ్యం రూ. 10వేలు, రెడ్డివారిపల్లె ప్రవీణ్ రూ.5వేలు, పి.శేఖర్ రూ.5వేలు, సరస్వతీపురం ఆర్.సుధాకర్ రూ. 10వేలు అందజేసినట్లు కమిటీ కోశాధికారి జ్యోతీశ్వరుడు వివరించారు.

యోగాతో ఆరోగ్యం



యోగా అభ్యాసం చేస్తున్న మండల పరిషత్, సచివాలయ సిబ్బంది

సదుం, మే 28(ఆంధ్రజ్యోతి): యోగా సాధనతో శరీరం, మనసు, ఆత్మ సమతుల్యత సాధ్యమని ఎంపీడీవో హరిబాబు పేర్కొన్నారు. మినీ యోగాంధ్ర సందర్భంగా బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో యోగా అభ్యాసం నిర్వహించారు. యోగా శిక్షకులు కిశోర్‌కుమార్, రెడ్డి ప్రవీణ, మండల పరిషత్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాపై శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీవో నారాయణ

సోమల, మే 28 (ఆంధ్రజ్యోతి): యోగా సాధనకు మాస్టర్ ట్రైనీలకు శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీవో నారాయణ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో యోగా సాధనకు ప్రత్యే శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈక్రమంలోనే 15 పంచాయతీల నుంచి 9 మందిని ఎంపిక చేసి మాస్టర్ ట్రైనీలకు యోగాపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో ఎంఈవో శివరత్న, ట్రైనీ పీడీలు కరుణానిధి, చిన్నప్ప, ఏపీవో షౌఖత్, ఏపీఎం శివ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి టీడీపీ పునరంకితం



మహానాడులో ఆనందరెడ్డి తదితరులు

రామకుప్పం, మే 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళల ఆర్థికాభివృద్ధి కోసం టీడీపీ పునరకింతం కానుందని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, పార్టీ రామకుప్పం మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణలు తెలిపారు. బుధవారం రెండో రోజు మహానాడులో వారు పాల్గొన్నారు. వారితోపాటు నాయకులు రామూర్తి, కృష్ణానాయక్, వెంకటాచలం, జయశంకర్, నందారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కొళ్లపల్లెబాబు, సత్తి, మనోహర్, గిరిదాసు, భాస్కర్, నాగభూషణం పాల్గొన్నారు.

బడుగుల దైవం ఎన్‌టీఆర్



ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న గోపీనాథ్ తదితరులు



కుప్పం మున్సిపల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

కుప్పం, మే 28 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ బడుగుల దైవమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పి.గోపీనాథ్ అన్నారు. కుప్పంలో బుధవారం తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతిని గోపీనాథ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండు కూడలిలో గల ఎన్టీఆర్ విగ్రహం వద్దకు వెళ్లి ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు చేశారు. ఈ సందర్భంగా గోపీనాథ్ మాట్లాడుతూ రెండు రూపాయలకే కిలో బియ్యం, జనతా వస్త్రాలు, ఎన్‌టీఆర్ ఇళ్లు వంటి ఎన్నో సంక్షేమ పథకాలు పేదలకోసం తొలిసారిగా అమలు చేసిన ఘనత ఆయనకే ఎన్‌టీఆర్‌కే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయన వారసత్వాన్ని అందిపుచ్చుకుని రాష్ట్రాభివృద్ధికోసం, పేదల సంక్షేమంకోసం నిరంతరం కృషిచేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేశ్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **మున్సిపల్ కార్యాలయంలో:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం దివంగత నందమూరి తారకరామారావు జయంతిని కుప్పం పురపాలక సంఘ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిం చారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

పుంగనూరు రూరల్, మే28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వభూమిని ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారని కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫిర్యాదు చేసినట్లు సింగిరిగుంట గ్రామస్తులు తెలియజేశారు. బుధవారం వారు మాట్లాడుతూ సింగిరిగుంట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్292/1ఎలో అరవపల్లెకు చెందిన నవీన్ 11సెంట్ల భూమిని కొనుగోలు చేశారని తెలియజేశారు. ఆ పక్కనే ప్రభుత్వం 292/1బిలో హంద్రీ-నీవా కాల్వ కోసం రైతుల నుంచి కొనుగోలు చేసి స్థలాన్ని కూడా నవీన్ ఆక్రమించి ఇళ్ల నిర్మాణం చేపట్టారని పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలను నిలుపుదల చేయాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, రైతులు శంకర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, రెడ్డెమ్మ, నాగరాజు, రెడ్డెప్ప, చిన్నరెడ్డెప్ప, గట్టప్ప తెలిపారు.

టీడీపీ నాయకుల అన్నదానం



పుంగనూరు, మే28(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, ఎన్‌టీఆర్ జయంతి వేడుకలను పుంగనూరులో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవరెడ్డి, శ్రీకాంత్, మోహన్‌రెడ్డి, శమీపతి, ఇబ్రహీం, దినేశ్, గంగాధర్, వెంకటరెడ్డి, రత్నమ్మ, ఆంజిరెడ్డి, గంగులప్ప, గంగరాజు, ప్రసాద్‌స్వామి, రమణ,నౌషాద్, సుబ్బన్న, శివకుమార్, రమేశ్, రాజు, వెంకటేశ్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలి



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

రొంపిచెర్ల, మే 28 (ఆంధ్రజ్యోతి): రుతు సమయంలో మహిళలు శుభ్రత పాటించాలని అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని రొంపిచెర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టరు వినయ్ తెలియజేశారు. రుతుక్రమం ఆరోగ్యం మరియు పరిశుభ్రత దినోత్సవం రొంపిచెర్లలో బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా బాలికలకు, మహిళలకు రుతుసమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీరియడ్స్ సమయంలో శానిటరీ ప్యాడ్స్ వినియోగించాలని సూచించారు. రోజుకు రెండు సార్లు స్నానం చేయాలని, మంచి పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈ రాజేశ్వరి, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పేదల పెన్నిధికి ఘన నివాళి



రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేస్తున్న నేతలు

రామకుప్పం, మే 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకులు ఎన్‌టీఆర్ జయంతిని రామకుప్పంలో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ సీతాపతిల ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూజలు చేసి, ఘననివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు రొట్టెలు, పండ్లు పంచిపెట్టారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మురళీధర్‌రెడ్డి, తెలుగుయువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్‌లు కార్యాలయ సిబ్బందితో కలిసి ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూజలు చేసి నివాళులర్పించారు. నాయకులు సలాంసాబ్, రామకృష్ణప్ప, విజయ్‌కుమార్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, రామలింగారెడ్డి, టీవీ రవి, ఆదిల్, అవినాశ్, సతీష్, బాలరాజు, సుబ్రీ, కేశవరెడ్డి, మంజునాథ్, శ్రీనాథరెడ్డి, అక్బర్‌సాబ్, అల్లీశీన, పద్మనాభరెడ్డి, మణీంద్రంనాగరాజు, భానుమూర్తి, ఆంజి, చలపతి, నారాయణరెడ్డి, సుబ్బయ్య, అప్పి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

గంగవరం,మే28(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని గంగవరం వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం గంగవరంలో రుతుక్రమం ఆరోగ్యం మరియు పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా వైద్యసిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలోని పీర్ ఎడ్యుకేటర్స్ వారి పరిధిలోని గ్రామల్లో ప్రజలు, పాఠశాలలతో పాటు ప్రత్యేకించి మహిళల ఆరోగ్య పరిస్థితిపై పర్యవేక్షణ ఉండాలన్నారు. అనంతరం పీర్ ఎడ్యుకేటర్స్‌కు యూనిఫామ్, టోపీలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లహరి, సూపర్‌వైజర్ జ్యోతీశ్వర్, సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్‌కు ఘన నివాళి



సోమలలో అంజలి ఘటిస్తున్న నాయకులు, కార్యకర్తలు



చౌడేపల్లెలో కేక్‌కట్ చేస్తున్న నాయకులు

సోమల, మే 28 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో ఎన్‌టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సోమల, పెద్దఉప్పరపల్లె, కమ్మపల్లె, పెద్దఉప్పరపల్లె, కందూరుల్లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమా ల్లో టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, హరిప్రసాద్, శివశంకర్, మల్లికార్జున, మహేంద్రబాబు, సుబ్రమణ్యం యాదవ్, ధర్మవరం శ్రీనివాసులు, వైవీ సుబ్బయ్య శెట్టి, రెడ్డిపార్థసారథి, శివ, ఉమాపతి నాయుడు, బాలాజీ నాయుడు, అష్రఫ్ అలీ, పి.శ్రీనివాసులు, బోసు, భానుప్రకాశ్ నాయుడు, రమేశ్ నాయుడు, వేణుగోపాల్‌నాయుడు, సుబ్బ రాయులు పాల్గొన్నారు.

చౌడేపల్లె: స్థానిక బస్టాండులో టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. నాయకులు కళ్యాణ్, కుమార్‌రెడ్డి, రమేష్, నాగరాజ, చంగ్రాలయప్ప, ధర్మతేజ, అడవి రమణ తదితరులు పాల్గొన్నారు.

మహానాడులో రక్తదానం





మహానాడు వద్ద ఉన్న టీడీపీ నాయకులు (ఇన్‌సెట్లో) రక్తదానం చేస్తున్న నాగరాజరెడ్డి

చౌడేపల్లె, మే28(ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న మహానాడుకు చౌడేపల్లె నుంచి అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు తరలివెళ్లారు. బుధవారం టీడీపీ నాయకులు మాదిరాజు లక్ష్మీపతిరాజు ఆధ్వర్యంలో మండలం నుంచి పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. అలాగే పలు పంచాయతీల నుంచి అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు వెళ్లారు. పసుపు పండుగలో పలువురు నాయకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రదీప్‌రాజు, నియోజకవర్గం యువత ఉపాధ్యక్షులు నాగరాజరెడ్డి, పగడాల హరిప్రసాద్, కార్తీక్, కుమార్‌రెడ్డి, మునిరాజు, సాగర్, శివశంకర్‌రాజు, బాబునాయుడు, విజయ భాస్కర్‌రెడ్డి, వేలూరు సుబ్రహ్మణ్యం, మణిరాజు, మంజునాథ్‌రెడ్డి వెళ్లారు.

పాస్టర్‌పై పోలీసులకు ఫిర్యాదు

పుంగనూరు రూరల్, మే28(ఆంధ్రజ్యోతి): స్థానిక సీఎస్ఐ హట్టస్ మెమోరియల్ చర్చి పాస్టర్ రాజేష్‌నిమ్రోత్‌పై బీజేపీ నాయకులు అయూబ్‌ఖాన్, నరిసింహులు బుధవారం ఫిర్యాదు చేశారు. మత మార్పిడికి హిందువులను ప్రలోభాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల క్రైస్తవ కమిటీ ఎన్నికల్లో మాల, మాదిగ కులస్తులకు చోటు లేకుండా అగ్రవర్ణాలకు మాత్రమే అవకాశం కల్పించడం వివక్షతకు దారితీస్తుందన్నారు. అందువల్ల పాస్టర్ నిమ్రోది, కమిటీ కార్యదర్శి రవికుమార్, కోశాధికారి కృష్ణపర్‌లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎన్‌టీఆర్ సేవలు చిరస్మరణీయం



ఎన్‌టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రామనాథంనాయుడు తదితరులు

కల్లూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): స్వర్గీయ ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు రామనాథంనాయుడు తెలిపారు. పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లెలో బుధవారం ఎన్‌టీఆర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మునికృష్ణమనాయుడు, టీడీపీ నాయకులు శ్రీనివాసులు నాయుడు, దేవ, తేజకుమార్, మోహన్‌నాయుడు, కిషోర్, జయచంద్రనాయుడు, విద్యాసాగర్, జనసేన నాయకులు మునికృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి గోళ్లపల్లెమ్మ తిరుణాల

రొంపిచెర్ల, మే 28 (ఆంధ్రజ్యోతి) రొంపిచెర్ల మండలం గానుగచింత పంచాయతీ నగిరి దాసరిగూడంలో ఈ నెల 29వ తేదీ నుంచి వచ్చే నెల 1వరకు గోళ్లపల్లెమ్మ తిరుణాల మహోత్సవం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. 29తేదీ గురువారం తిరుపతి కోటి ఈవెంట్స్ డ్యాన్స్ ప్రోగ్రామ్స్, 30న ఆసాది వారి కథ, టీవి గాయకులు దామోదర గణపతిరావు విజయవాడ వారిచే రేలా, రే రేలా, జనపదగీతాలు, నృత్యాలు. 31న అమ్మవారి ఊరేగింపు, ఊంజల్ సేవలు, ఆదివారం బోనాల సమర్పణ, ప్రత్యేక పూజలు జరుగుతాయని వివరించారు. భక్తులు విచ్చేసి అమ్మవారి ఆశీర్వాదం పొందాలని కోరారు.

సచివాలయ సిబ్బందికి యోగాపై శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి

రొంపిచెర్ల, మే 28 (ఆంధ్రజ్యోతి) రొంపిచెర్ల బాలుర జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో బుధవారం సచివాలయ సిబ్బందికి ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, యోగా గురువు రాజేంద్ర యోగాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వచ్చే నెల 21న రాష్ట్ర వ్యాప్తంగా జరిగే యోగా కార్యక్రమానికి సచి వాలయ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ప్రజలకు యోగాపై అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. అందుకోసం 30వ తేదీ వరకు మూడు రోజులు శిక్షణా తరగతులు జరుగుతాయన్నారు. మాస్టర్ ట్రైనర్ శ్రావణి, పీడీ రంగారెడ్డి, పీఈటీ రసూల్, రాజేంద్రనాయుడు పాల్గొన్నారు.

సోమల గంగమ్మకు మరుపల్లెం పూజలు

సోమల, మే 28 (ఆంధ్రజ్యోతి): సోమల స్వయంభేశ్వరస్వామి ఆలయం వద్ద నడివీధి గంగమ్మకు మరుపల్లెం పూజలు శాస్త్రోక్తంగా జరిపారు. సోమల గంగజాతర నేపథ్యంలో గత మంగళవారం అమ్మవారిని ప్రతిష్ఠించి వేడుకలు నిర్వహించారు. ఈ క్రమంలో బుధవారం మరుపల్లెం పూజలు జరిగాయి. ఆసాదివారు గేయాలు ఆలపించారు. భక్తులు పొంగళ్లు సమర్పించారు. వెంకటరమణ, చెన్నరాయప్ప, జగన్‌మోహన్, సురేంద్ర, సుధాకర్, సోమశేఖర్, కృష్ణప్ప పాల్గొన్నారు.

చంద్రప్రభ వాహనంపై ఇంద్రవరదుడి అభయం



యాదమరి, మే 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం త్రివేణి సంగమంలో వరదరాజస్వామి ఆలయ వార్షిక బ్రహోత్సవాలు వైభవంగా ప్రారభమయ్యాయి. బుధవారం ఉదయం అలంకరణ, అర్చన, కైంకర్యాలు, సేవలు నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా వేదపండితులు ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని వరదుడిని దర్శించుకున్నారు. రాత్రి చంద్రప్రభ వాహనంపై అలంకారభూషితుడైన స్వామి భక్తులకు అభయాన్ని ప్రసాదించారు. వేదపండితుల మంత్రాలు, మంగళవాయిద్యాలు మోగుతుండగా ఊరేగారు. భక్తులు మంగళహారతులతో ఫలపుష్పాలు సమర్పించారు. గురువారం ఉదయం సప్రంలో ఉత్సవం, అలంకార అభిషేకం, రాత్రి హంస వాహనసేవ జరుగనుంది.

వైభవంగా అర్జున తపస్సు



శ్రీరంగరాజపురం, మే 28(ఆంధ్రజ్యోతి): ఆరిమాకుపల్లెలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల మహాభారత బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అర్జున తపస్సు ఘట్టం వైభవంగా జరిగింది. ఉదయం ధర్మరాజుల మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు చేశారు. అర్జున పాత్రధారి తపస్సు మానును ఎక్కే సందర్భంగాలో ఒక్కో మెట్టుకు ఒక్కో పద్యం పాడుతూ తనతో తెచ్చుకున్న జోలెలో తీసుకెళ్లిన ఫలపుష్పాలను, విభూది, నిమ్మకాయలను వెదజల్లాడు. వీటిని దక్కించుకోవడానికి మహిళలు పోటీపడ్డారు. ఆ తరువాత వారు తపస్మాను ఎదుట వరపడ్డారు. ధర్మకర్త లింగారెడ్డి, రామనాథరెడ్డి, పురుషోత్తం, జగన్నాధం నాయుడు, గోవింద స్వామి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జనుము విత్తనాల పంపిణీ

గంగాధరనెల్లూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాలుగు రైతుసేవా కేంద్రాల్లో గురువారం నుంచి సబ్సిడీపై జనుము విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి భవాని తెలిపారు. 10కిలోల జనుము విత్తనాలు ధర రూ.1,090 కాగా, ప్రభుత్వం రైతులకు 50శాతం సబ్సిడీతో అందజేస్తుందన్నారు. భూమిపట్టాదారు పాసు పుస్తకాలతో పాటు ఆధార్ కార్డులతో గంగాధరనెల్లూరు, వేల్కూరు, పాపిరెడ్డిపల్లె, నెల్లేపల్లె గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాల్లోని అధికారుల దగ్గర నమోదు చేసుకుని జనుము విత్తనాలు తీసుకోవచ్చునన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

నింద్ర, మే 28(ఆంధ్ర జ్యోతి): అత్తూరు వద్ద తచ్చూరు-బెంగులూరు హైవే రోడ్డును డివైడర్‌ను ఢీకొన్న పన్నీర్ (42) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. విజయపురం మండలం కలియంబాకంకు చెందిన ఇతడు మాధవరంలో పాస్టర్ ఉన్నాడు. ఈ నెల 1 న హైవే పై వస్తుండగా ద్విచక్రవాహనం వాహనం అదుపు తప్పి డీవైడర్‌ను ఢీకొంది. తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

మరుపల్లెం పూజలు

సోమల, మే 28 (ఆంధ్ర జ్యోతి): సోమల స్వయంభేశ్వర స్వామి ఆలయం వద్ద నడివీధి గంగమ్మకు మరుపల్లెం పూజలు శాస్త్రోక్తంగా జరిపారు. సోమల గంగజాతర నేపథ్యంలో గత మంగళవారం అమ్మవారిని ప్రతిష్టించి వేడుకలు నిర్వహించారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళులు







చిత్తూరులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నగర కమ్మ సంఘం నాయకులు- జిల్లా టీడీపీ కార్యాలయంలో- పీసీఆర్ సర్కిల్‌లో నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు అర్బన్, మే 28(ఆంధ్రజ్యోతి): తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన నేత ఎన్టీఆర్ అని ఏఆర్ ఏఎస్పీ శివానంద కిశోర్ అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. **చిత్తూరు సిటీ** : స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి పార్టీ నాయకులకు, కార్యకర్తకు పంచిపెట్టారు. జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టర్ గురజాల చెన్నకేశవులు నాయుడు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, సురేంద్రకుమార్, నేతలు పాల్గొన్నారు. నగరంలోని జిల్లా టీడీపీ కార్యాలయం, జిల్లా పరిషత్, డీసీసీబీ, మునిసిపల్ కార్యాలయాల్లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. . కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, సురేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు. **ఐరాల**: పాటూరు సంతగేటులో అభిమానులు ఎన్టీఆర్ భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేసి 102 కొబ్బరి కాయలు కొట్టారు. బాణసంచా కాల్చారు. అగరంపల్లె వద్ద భూమాబాలకృష్ణ పేదలకు అన్నదానం నిర్వహించారు. టీడీపీ నాయకులు బత్తలసురేంద్రనాయుడు, దేవాజీనాయుడు, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు. **యాదమరి**: మండల పార్టీ కార్యాలయంలో కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్ నాయుడు, మాదవ నాయుడు, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పెనుమూరు: మెయిన్‌రోడ్డులో, ఎంపీడీవో కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంచిపెట్టారు. మండల అధ్యక్షులు రుద్రయ్యనాయుడు, మాజీ ఎంపీపీ హరిబాబునాయుడు, మనోహర్‌రెడ్డి, తలారిరెడ్డెప్ప, ఈశ్వర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **గుడిపాల**: తొమ్మిది నెలల వ్యవధిలోనే అందరి ఆదరాభిమానాలు పొందిన టీడీపీని అధికారంలోకి తెచ్చిన ఘనత స్వర్గీయ ఎన్టీయార్‌దేనని మండల టీడీపీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, సీనియర్ నేతలు చెన్నకేశవులునాయుడు, బాలాజీ నాయుడు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో భారీ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు హేమాద్రి నాయుడు, రెడ్డప్ప, బాలసుబ్రహ్మణ్యం యాదవ్, తదితరులు పాల్గొన్నారు. . **నగరి**: టవర్‌క్లాక్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. .కార్యక్రమంలో బాలాజీ, దేశమ్మ, కృష్ణారెడ్డి, ఆనందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.**పూతలపట్టు**: మండలకేంద్రంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నాయకులు గుంటూరు మురళి, నాగరాజు, విజయలక్ష్మి, గురవప్ప తదితరులు పూలమాల వేశారు.

చిత్తూరు కల్చరల్: స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో బుధవారం నగర కమ్మసంఘం నాయకుల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి ఘనంగా జరిగింది. ఎన్టీఆర్ విగ్రహానికి సంఘం ప్రతినిధులు వెంకటేశులు నాయుడు, ధనంజయ నాయుడు, కేశవులునాయుడులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి పంచి పెట్టారు. కార్యక్రమంలో కమ్మ సంఘం మహిళా,యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.బంగారుపాళ్యం: మండల కేంద్రంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేశారు. అన్నదానం చేపట్టారు. మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్ మాట్లాడారు. **వెదురుకుప్పం**: కార్వేటినగరం గాండ్లమిట్ట కూడలిలో ఎన్టీఆర్ చిత్ర పటానికి బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మేళం రవియాదవ్, నాయకులు వాసుదేవరెడ్డి, సంధాని పూలమాల వేశారు.. **తవణంపల్లె**: మండల కేంద్రంలో ఎన్టీఆర్ చిత్ర పటానికి మాలలు వేశారు. భారీ కేక్‌ను కట్ చేసి పంచి పెట్టారు. టీడీపీ మండల అధ్యక్షుడు గాలి దిలీప్, వెంకటేష్ చౌదరి, భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.



ఐరాల: సంతగేటు వద్ద కొబ్బరి కాయలు కొడుతున్న కార్యకర్తలు



పెనుమూరులో ...

వైభవంగా ప్రధాన కలశ స్థాపన



కలశాలను తీసుకొస్తున్న అర్చకులు

ఐరాల (కాణిపాకం), మే 28(ఆంధ్ర జ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ అనుబంధం వీరాంజయస్వామి ఆలయ జీర్ణోద్ధరణ, మహాకుంభాభిషేకంలో భాగంగా బుధవారం వైభంగా ప్రధాన కలశ స్థాపన నిర్వహించారు. ఉదయం భగవత్ పుణ్యాహవచనం, వేదపారాయణం, సుందరకాండ,సంక్షిప్త రామాణం, దివ్య ప్రబంధ పారాయణం జరిగింది. అనంతరం ప్రధాన కలశ స్థాపన, చక్రాబ్జ మండలారాధన, అగ్ని ప్రతిష్ట, విష్ణు పంచసూక్తి సహిత మన్యూసూక్త హోమం, సీతాలక్ష్మణ,హనుమత్సమేత శ్రీరామచంద్ర మూల మంత్ర హవనం,రామ పరివార, ఉపదేవతాహోమం, విమాన గోపుర ఆదివాసం, లఘుపూర్ణాహుతి, బలి, శాత్తుమొరను నిర్వహించారు. ఈవో పెంచలకిషోర్, మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి, దాత అనిల్ కుటుంబ సభ్యులు, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు పాల్గొన్నారు.

పెనుమూరు సినిమా థియేటర్‌లో తనిఖీ

పెనుమూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : సినిమా థియేటర్‌లో తినుబండారాలు, కూల్‌డ్రింక్స్ సాధారణ ధరలకే విక్రయించాలని తహసీల్దారు శ్రావణ్‌కుమార్ సూచించారు. బుధవారం పెనుమూరు సినిమా థియేటర్‌లో ఆయన తనిఖీ నిర్వహించారు. లైసెన్స్, ఫైర్, పార్కింగ్, సిటింగ్ సామర్థ్యం, వంటి అనుమతులను పరిశీలించారు. ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని యజమానికి చెప్పారు.

వేణుగోపాలుడికి పుష్పయాగ మహోత్సవం



వెదురుకుప్పం, మే 28(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం వైభవోపేతంగా పుష్పయాగం నిర్వహించారు. పలు రకాల పత్రాలు, పుష్పాలను ఈ వేడుకలో ఉపయోగించారు. వార్షిక బ్రహ్మోత్సవాల క్రమంలో తెలియక జరిగిన లోపాలకు ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీ. తొలుత ఉత్సవమూర్తులకు నిర్వహించారు. మధ్యాహ్నం వేద మంత్రోచ్చరణలతో మధ్య శాస్త్రోక్తంగా పుష్పయాగ మహోత్సవం చేపట్టారు. అలాగే తిరువీధి ఉత్సవం కూడా నిర్వహించారు. కార్యక్రమాల్లో టెంపుల్ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, షరాబు బాబుసురేష్, వేదపండితులు దాశరథి, గోపాలాచారి పాల్గొన్నారు.

వసంతాలతో ముగిసిన గంగమ్మ జాతర

గుడిపాల, మే 28(ఆంధ్రజ్యోతి): కుప్పిగానిపల్లెలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న గంగమ్మజాతర బుధవారం వసంతాలతో ముగిసింది. ప్రత్యేకపూజలు చేసి పొంగళ్లు సమర్పించారు. అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లారు. పేయనపల్లెలో సీతారామ కల్యాణాన్ని నిర్వహించి పసుపుదారాలను అందజేశారు. సీతారాములను పుష్పపల్లకిలో ఊరేగించారు.



కార్యకర్తలే టీడీపీకి అండ



సభ్యత్వ కార్డును పంపిణీ చేస్తున్న చెన్నకేశవులు

గుడిపాల, మే 28(ఆంధ్రజ్యోతి): పార్టీకి కార్యకర్తలే అండ అని జీజేఎం ట్రస్టు నిర్వాహకులు చెన్నకేశవులు నాయుడు అన్నారు. బుధవారం బసవాపల్లె పంచాయతీ రెట్టకుంటలో టీడీపీ సభ్యత్వకార్డులను పంపిణీ చేశారు. సభ్యత్వం నమోదువల్ల పార్టీ కార్యకర్తలకు భరోసా లభిస్తుందన్నారు. పాక్షిక ప్రమాదం జరిగితే రూ. 2 లక్షలు, మరణిస్తే రూ. 5 లక్షల వరకు బీమా వర్తిస్తుందని చెప్పారు. మధుసూదన్‌నాయుడు, వినాయకం, లోకేష్ పాలొన్నారు.

మహానాడులో జిల్లా టీడీపీ శ్రేణులు





మహానాడులో ఎమ్మెల్యే భానుప్రకాష్‌తో విజయపురం పార్టీ నాయకులు- పెనుమూరు నేతలు

విజయపురం, మే 28(ఆంధ్రజ్యోతి): మహానాడుకు బుధవారం మండలం నుండి సుమారు నాయకులు, కార్యకర్తలు. అక్కడ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి చినబాబును కలిశారు. పార్టీ నాయకులు బాలసుబ్రహ్మణ్యంరాజు, రమేష్‌రాజు, బాబుయాదవ్, గుణభూషణమ్మ, తదితరులు పాల్గొన్నారు. **నగరి** : మహానాడుకు తెలుగు తమ్ముళ్లు భారీగా తరలి వెళ్లారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు రమేష్‌బాబు, జిల్లా టీడీపీ కార్యదర్శి రుక్కుం. బాలాజీ, జ్యోతినాయుడు శివకుమార్‌రెడ్డి తదితరులు వెళ్లిన వారిలో ఉన్నారు.**నింద్ర**: మహానాడుకు మండలం నుంచి హాజరైన నాయకులు, కార్యకర్తలు బుధవారం ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌ను కలిశారు. **గంగాధరనెల్లూరు**: మహానాడు కార్యక్రమంలో మండలానికి చెందిన టీడీపీనేతలు ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, శ్రీధర్‌యాదవ్, కామసాని కోదండరెడ్డి, మోహన్‌నాయుడు, బాలచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగా నిర్వహణకు స్థల పరిశీలన



పులిగుండువద్ద స్థల పరిశీలిస్తున్న అధికారులు

పెనుమూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండలంలో టూరిజం శాఖ ఆధ్వర్యంలో వెయ్యి మందితో యోగా డే నిర్వహించాలని అధికారులు ఆదేశించారు. ఈక్రమంలో జిల్లా టూరిజం ఆఫీసర్ గౌరి బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు యోగా రిజిస్ట్రేషన్‌లపై సమీక్ష నిర్వహించారు. అనంతరం పులిగుండు వద్ద స్థల పరిశీలన చేశారు. ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, తహసీల్దారు శ్రావణ్‌కుమార్, ఎంఈవో భాస్కర్‌నాయుడుతో పాటు సెక్రటరీలు పాల్గొన్నారు. **వెదురుకుప్పం**: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం గ్రామ సచివాలయ ఉద్యోగులకు యోగాంధ్ర శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో ఎల్.పురుషోత్తం ఆధ్వర్యంలో చేపట్టారు. యోగ శిక్షకులు త్రిలోకసుందరి, భాగ్యరాజ్, మోహన్ ఉద్యోగులకు యోగాసనాలను నేర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మోహన్‌కుమార్ పాల్గొన్నారు. **గంగాధరనెల్లూరు**: ప్రతివ్యక్తికి ఆరోగ్యకర జీవితం లభించాలంటే రోజూ యోగాసనాలు వేయడం వల్ల సాధ్యమవుతుందని ఎంపీడీవో సోమలరాజు సతీష్ అన్నారు. బుధవారం సచివాలయం ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులకు యోగసనాలపై అవగాహన కల్గించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లోకేష్ , సిద్దేశ్వర కొండ హోమియోపతి ఆసుపత్రి డాక్టర్ అస్మ అంజుమ్ తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రం: ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆర్యంలో బుధవారం యోగా డే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, వెలుగు, ఉపాధి సిబ్బంది యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో క్రిష్ణమహేష్‌రెడ్డి పాల్గొన్నారు.**గుడిపాల**: యోగా సాధనతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో శిరీష, తహసీల్దార్ జయంతి, జిల్లా యోగా అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసులునాయుడు అన్నారు. నరహరిపేట జడ్పీ హైస్కూల్‌కు సంబంధించిన గ్రౌండ్‌లో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలటీడీపీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ ఎంపీపీ నాగరాజయాదవ్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.**విజయపురం**: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం యోగాపై పంచాయతీ కార్యదర్శులకు శిక్షకులు కైలాసం యదవ్ శిక్షణ నిర్వహించారు. ఎంపీడీవో రాజేంద్ర,సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఇంటి వద్దే రేషన్ ఇవ్వాలి



మాట్లాడుతున్న తహసీల్దారు శ్రావణ్‌కుమార్

పెనుమూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): జూన్ 1 నుంచి రేషన్ సరుకులను డీలర్లే పంపిణీ చేయాలని సివిల్ సప్లై డీటీ మోహన్‌రాజ్, తహసీల్దారు శ్రావణ్‌కుమార్ తెలిపారు. బుధవారం వారు డీలర్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ షాపులు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. 65 ఏళ్లు నిండిన వారికి ఇంటి వద్దకే తీసుకెళ్లి ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ వాణి, డీలర్‌లు పాల్గొన్నారు.

అప్పుల బాధతో ప్రైవేట్ ఉద్యోగి ఆత్మహత్య

చిత్తూరు అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. గూలింగ్స్‌పేట్‌కు చెందిన రవి (41) ఓ ప్రైవేట్ ఫ్యాక్టరీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ అవసరాల నిమిత్తం అప్పులు చేశాడు. అప్పులిచ్చినవారు ఒత్తిడి చేయడంతో బుధవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమార్తె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దాడి చేసిన యువకుల అరెస్టు

శ్రీరంగరాజపురం, మే 28(ఆంధ్రజ్యోతి): కటింగ్ షాపులో ఓ వ్యక్తిపై ముగ్గురు యువకులు దాడి చేశారు. పిళ్లారికుప్పం క్రాస్ రోడ్డులో కటింగ్ షాపులో పనిచేసే ఓ వ్యక్తిపై చిన్న తయ్యూరుకు చెందిన చందు, ప్రశాంత్, ఉదయ్‌లు బుధవారం మద్యం తాగి వచ్చి దాడి చేశారు. సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు. వీరిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. .

వైభవంగా గంగమ్మ నిమజ్జనం



గంగమ్మకు సారె తీసుకొస్తున్న ఎమ్మెల్యే మురళిమోహన్, సర్పంచ్ లోకేష్

ఐరాల, మే 28(ఆంధ్రజ్యోతి):గార్గేయి నదీ తీరాన పాలేటిగంగమ్మ జాతర బుధవారం రాత్రి గంగమ్మ నిమజ్జనం వైభవంగా జరిగింది. పరిసర గ్రామాల భక్తులు పొంగళ్లు పెట్టి, అంబళ్లు పోశారు. రాత్రి అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళి మోహన్, పాతపాళ్యం సర్పంచ్ లోకేష్ ఇంటి వద్ద నుంచి గజమాలను ర్యాలీగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. చివరగా అమ్మవారి శిరస్సును తొలగించి జాతరను పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సుచిత్ర, మండల పార్టీ అధ్యక్షుడు హరిబాబునాయుడు, మాజీ మండల అధ్యక్షుడు గిరిధర్‌బాబు, మాజీ సర్పంచ్ జయచంద్రయ్య, మాజీ జడ్పీటీసీ లత, భారీ సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.